# అన్నీ అడ్డంకులే...!

**-ప్రారంభం కాని హెచ్ సిటీ పనులు**
**-కెబిఆర్ చుట్టూ పనులకు లీగల్ సమస్యలు**
**-స్థల సేకరణకు తప్పని ఇబ్బందులు**




**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** మహానగరంలో రోజురోజుకి రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా దాదాపు అన్ని ప్రాంతాల్లో సిగ్నల్ రహిత ప్రయాణాన్ని అందుబాటులో తెచ్చిన విధంగా కేబీఆర్ పార్కు చుట్టూ అండర్ పాస్‌లు, స్టీల్ ఫ్లై ఓవర్లు అందుబాటులోకి తేవాలన్న ప్రతిపాదన ఏ ముహూర్తానా ఆమోదించారో గానీ, దానికి అడుగడుగునా అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. 2016లో అప్పటి బిఆర్ఎస్ సర్కారు స్ట్రాటెజికల్ రోడ్ డెవలప్ మెంట్ (ఎస్ఆర్‌డీపీ)1 కార్యక్రమం కింద కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆరు అండర్ పాస్ లు, ఏడు స్టీల్ ఫ్లై ఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించిన వెంటనే కేబీఆర్ పార్కులోని పచ్చదనాన్ని ధ్వంసం చేస్తున్నారని, అందులో వన్యప్రాణుల మనుగడను ప్రశ్నార్థం చేస్తున్నారంటూ కొందరు ఏకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించగా, ఆ పనులకు ప్రతిపాదనల స్థాయిలోనే బ్రేక్ పడింది. కొన్ని సంవత్సరాల తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వివాదం సమసిపోయిందని, ఇక పనులు మొదలు పెట్టాలని భావించగా, సరి కొత్త వివాదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఆ తర్వాత రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. ఎస్ఆర్ డీపీ అంటూ ప్రత్యేకంగా కాకుండా రోడ్లు, నాలాలు, ఇతర అభివృద్ధి పనులన్నింటినీ హెచ్ సిటీ1 గొడుగు కిందకు తీసుకువచ్చి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించటంతో కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1090 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆరు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లై ఓవర్లను నిర్మించే ప్రతిపాదనను జీహెచ్ఎంసీ ప్రతిపాదించగా, దానికి సర్కారు వెంటనే రూ. 825 కోట్ల పనులకు మంజూరీనిచ్చింది. ఇక అన్ని రకాల అడ్డంకులై తొలిగిపోయాయని భావించిన జీహెచ్ఎంసీ కేబీఆర్ చుట్టూ చేపట్టనున్న పనుల ప్రతిపాదనల్లో స్వల్పంగా మార్పులు చేసింది. ఏడుఫ్లై ఓవర్లను నిర్మించేందుకు ఎక్కువ సమయం పడుతుందన్న విషయాన్ని గ్రహించిన జీహెచ్ఎంసీ ఆఫ్లై ఓవర్లను స్టీల్‌తో నిర్మించాలని ప్రతిపాదించగా, సర్కారు అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కేబీఆర్ పార్కు చుట్టు మొత్తం 295 ఆస్తులను స్థల సేకరణకు కోసం జీహెచ్ఎంసీ గుర్తించింది. వీటిలో 112 ఆస్తులకు నాలుగు నెలల క్రితం మార్కింగ్ కూడా చేసింది.

**పార్కుచుట్టూ ప్రముఖుల ఆస్తులు..**

కెబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ హాస్పిటల్, జూబ్లీహిల్స్ చెకోపోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్పస్ నిర్మాణం జరగనుంది. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టీల్ బ్రిడ్జి, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి రోడ్డు నెంబరు 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్పై భాగంలో రెండు లైన్లతో రానుంది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ 36 వైపు వెల్లే నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనుంది. భూ సేకరణలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉంది. టీడీపీ కార్యాలయం పక్కన మినహా చుట్టూ రోడ్డుని విస్తరించనున్నారు. వంద ఫీట్ల మేర ఉన్న రోడ్డుని 120 ఫీట్లుగా వైడెనింగ్ చేయనున్నారు. ఈ రహదారి కింద మార్గంలో అండర్‌పాస్ పైన స్టీల్ బ్రిడ్జిలతో పాటు 120 ఫీట్ల రోడ్డు వస్తుండడంతో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యకు అవకాశం ఉండదు. రహదారి విస్తరణకు 87 ఆస్తులను సేకరించనున్నారు. బీఆర్ పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్పోస్టు మీదుగా రోడ్డు నంబరు 45 బాలకృష్ణ ఇంటివైపు, సీవీఆర్ చౌరస్తా, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ వైపు, అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నం 12 వైపు ఈ ఫ్లై ఓవర్లను నిర్మించే ప్రతిపాదనలు రూపొందించారు.

ఫ్లై ఓవర్లు, అండర్పాస్ నిర్మాణం కోసం డిజైన్లు పూర్తి చేశారు. ఎక్కడెక్కడ పిల్లర్లు నిర్మించాలో ఆ ప్రాంతాల్లో మార్కింగ్ పూర్తి చేశారు. ప్రాథమికంగా భూ పరీక్షలు పూర్తయిన తర్వాత పిల్లర్ల నిర్మాణానికి శ్రీకారం చుడతారు. ఐతే ఈ భూసేకరణలో మాజీ మంత్రితో పాటు సినీహీరో ఏపీ ఎమ్మెల్యేకు చెందిన ఆస్తులకి సంబందించి కూడా కొంత మేర స్థలం సేకరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఓ దఫా మార్కింగ్ కూడా జరగడం.. ఈ ఇద్దరు ప్రముఖులు వ్యతిరేకిస్తున్నారని అధికార వర్గాల సమాచారం.

హైదరాబాద్ వార్త



# దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల నిందితులకు ఉరి శిక్ష

**-ముమ్మాటికి సరైనదే.. బాధిత కుటుంబాల హర్షం**



**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. పేలుళ్లకు పాల్పడ్డ ఐదుగురికి ఉరి శిక్ష సరైనదేనని సంచలన తీర్పునిచ్చింది. నిందితులకు ఉరిశిక్ష ఖరారు చేసింది. 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పుపై మీడియాతో బాంబు పేలుళ్ల బాధిత కుటుంబాలు తమ ఆవేదనను పంచుకున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనపై హైకోర్టు ఇచిన తీర్పుపై మేము హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. 'నింధితులకు మరణశిక్ష విధించడం న్యాయస్థానంపై మరింత గౌరవం పెరిగింది. అయితే ఇన్ని రోజులు సుదీర్ఘంగా విచారణ చేపట్టడం మాకు బాధ కలిగించింది. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు కోర్టులు త్వరితగతంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాము. పేలుళ్లకు పాల్పడ్డ ఐదుగురికి ఉరి శిక్ష ముమ్మాటికి సరైనదే. 2013లో జరిగిన భయానక ఘటన ఇంకా మా కండ్ల ముందు తిరుగుతూనే ఉంది. మమ్మల్ని భయం ఇంకా వెంటాడుతూనే ఉంది. మమ్మల్ని బాధిత వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో సంఘటన జరిగినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. 2013లో కాంగ్రెస్ మాకు ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది.. కానీ నెరవేర్చలేదు. మా కుటుంబ సభ్యులు కొందరు కాళ్లు చేతులు తెగిపోయి చెవులు వినబడక ఇంకా మంచం పైనే ఉన్నారు. వెంటనే నిందితులను ఉరితీసి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాం' అని వెల్లడించారు.

**హైకోర్టు తీర్పు హర్షణీయం : డాక్టర్ గౌతంరావు**

దిల్‌సుఖ్‌నగర్ బాబు పేలుళ్ల ఘటనపై హైకోర్టు తీర్పు హర్షణీయమని బిజెపి హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాదులకు ఉరిశిక్ష వేయడం సంతోషకరమన్నారు. బాంబు పేలుళ్లతో కొంత మంది కుటుంబ సభ్యులను కోల్పోగా, ఆ ఘటనలో గాయపడిన మరికొందరు నరకయాతన అనుభవిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ఉగ్రవాదాన్ని ఎవ్వరూ ఎట్టి పరిస్థితుల్లో సమర్థించవద్దన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజకీయ పార్టీలు పాకులాడకుండా ఉగ్రవాదం విషయంలో ఏట్టి పరిస్థితుల్లో రాజీపడొద్దని గౌతంరావు అన్నారు.

# 12న హనుమాన్ జయంతి శోభాయాత్ర

**-గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు యాత్ర**
**-పోలీసు అధికారులతో సిపి సి.వి.ఆనంద్ విడియో కాన్ఫరెన్స్**




హనుమాన్ జయంతి శోభాయాత్రపై నిర్వహించిన వీడియో కాన్ఫరేన్స్‌లో మాట్లాడుతున్న సిపి సి.వి.ఆనంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

నగరంలో జరిగే హనుమాన్ జయంతి శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన జరిగే శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర సందర్భంగా సీపీ సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో జరిగిన శ్రీ హనుమాన్ జయంతి శోభాయాత్ర సందర్భంగా జరిగిన సంఘటనలు, బందోబస్తు ఏర్పాట్ల విషయమై చర్చించి పోలీసు అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, స్పెషల్ బ్రాంచ్ డిసిపి ఎస్.చైతన్య కుమార్, డిసిపి.పుష్ప వర్చువల్‌గా జోనల్ డిసిపిలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

-చిన్న ఊరేగింపుల అనుసంధానం అయ్యే కూడలి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.

-మతపరమైన ప్రదేశాల వద్ద సమస్యాత్మకమైన ప్రాంతాలలో ప్రత్యేక అదనపు బలగాలను మోహరించాలి. నిరంతరం నిఘా కొనసాగించాలి.

-ముందస్తు చర్యగా సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు హనుమాన్ జయంతి శోభాయాత్ర మార్గము (గౌలిగూడలోని శ్రీ రామ మందిరం నుండి ప్రారంభమై బైబిల్ హౌస్ నుండి తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్) వరకు క్షణంగా పరిశీలించి ఏదైనా అవాంతరాలు ఉన్నచోట సంబంధిత అధికారులకు తెలిపి సరి చేయించాలి.

-ఊరేగింపులో డీజే సిస్టమ్‌లను ఉపయోగించకుండా ఉండటం వలన ప్రజల మరియు భక్తుల ఆరోగ్యం పట్ల వారికి మేలు చేసినట్లవుతుందంటూ నిర్వాహకులకు తెలియజేయాలి.

-ఫైర్ క్రాకర్లు పేల్చడం, బాటసారులపై వేయటం, గులాల్ రంగు పోయటం చేయవద్దంటూ నిర్వాహకులకు తెలపాలి.

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శోభాయాత్ర ముగిసిన తరువాత, తిరుగు ప్రయాణములో వెళ్ళేటప్పుడు సంయమనం పాటించాల్సిన అవసరము ఉంది.

-రెచ్చగొట్టే బ్యానర్‌లను ప్రదర్శించడం చేయకూడదు. పరిమిత సంఖ్యలో వాహనాలను ఉపయోగిస్తూ, ఇతర వర్గాల ప్రజలకు ఎలాంటి ఆటంకం కులకకుండా చూసుకోవాలి.

-పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాల వినియోగం అనుమతించబడదంటూ నిర్వాహకులకు తెలియజేయాలి.

# అల్వాల్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

**-మచ్చబొల్లారం హిందూ స్మశానవాటికలోని నిర్మాణాలు ఆపాలని ఆదేశం**
**-గ్రీన్‌ఫీల్డ్స్ ప్రభుత్వ భూములు సందర్శన**



స్మశానవాటికను సందర్శించిన రంఘనాథ్

**అల్వాల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** హైడ్రా కమీషనర్ రంగనాథ్ అల్వాల్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షణ్ణంగా పరిశీలించారు. నెల రోజులు కాలంగా మచ్చబొల్లారం డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో 30 కాలనీలకు చెందిన జాక్ ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. హిందూ స్మశాన వాటికను కబ్జా చేసి అనధికారికంగా ట్రాన్స్‌సిస్ట్ పాయింట్‌ను కాస్తా రాంకీ డంపింగ్ యార్డ్‌గా మార్చిందనే అంశంపై హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎంపి ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించడంతో పాటుగా స్వయంగా డంపింగ్ యార్డ్‌లోని చెత్తలో కూర్చుని తన నిరసన తెలిపారు. డంపింగ్ యార్డ్ విషయం ప్రభుత్వం స్థాయిలో చర్చాంశనీయంగా మారిన నేపథ్యంలో హైడ్రా కమీషనర్ రంగనాథ్ రంగ ప్రవేశం చేశారు. ట్రాన్స్‌సిస్ట్ పాయింగ్ కోసం స్మశానవాటికలో రెండు ఎకరాలు కేటాయించగా మరో మూడు ఎకరాలు వరకు కబ్జా చేయడంతో పాటుగా శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్థానిక పరిస్థితులను వివరించారు. అనధికారిక నిర్మాణాలను తక్షణం ఆపాలని అల్వాల్ సర్కిల్ డిసి శ్రీనివాస్ రెడ్డిని ఆయన అదేశించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎటువంటి నిర్మాణాలు జరపరాదని స్పష్టం చేశారు. కొత్త నిర్మాణాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనధికార డంపింగ్ యార్డ్‌కు సంబంధించి ప్రభుత్వ పెద్దలుతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. యార్డ్‌ను పూర్తిగా తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని ప్రత్యామ్నాయంపై దృష్టి సారించిన తరువాతే అది సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం హైడ్రా టీమ్ గ్రీన్‌ఫీల్డ్స్ ప్రభుత్వ భూములను సందర్శించడం జరిగింది. ప్రభుత్వ భూములు కబ్జాకు సంబంధించిన విషయంలో హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులను కలిసిన రంగనాథ్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓఆర్‌సిలు సృష్టించుకుని ప్రభుత్వ భూములు తమవిగా పలువురు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. నాలుగు దశాబ్దాలుగా ప్లాట్లు కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికి రియల్ దందా కొనసాగుతోందని వారు వాపోయారు. బలవంతులదే రాజ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్స్ ప్రభుత్వ భూములకు సంబంధించి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని భవిష్యత్తులో అంతా మంచి జరుగుతుందని రంగనాథ్ భరోసా ఇచ్చారు. హైడ్రా దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై స్పందించడం జరుగుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఆక్రమణలు ఇతర సమస్యలకు సంబంధించి ప్రజలు నేరుగా హైడ్రాను సంప్రదించవచ్చని తెలిపారు.

# స్నేహితుల దాడిలో యువకుడు మృతి

**-గంజాయి అమ్ముతున్నాడని తప్పుడు ప్రచారం చేస్తున్నాడని కొట్టి చంపిన స్నేహితులు -యాప్రాల్‌లో ఘటన**

**జవహర్‌నగర్ ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** స్నేహితుల దాడిలో యువకుడు మృతి చెందాడు. గంజాయి అమ్మకాలు చేస్తున్నాడని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న స్నేహితుడిని ఇంటి నుండి తీసుకెళ్లి గోల్ఫ్‌రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జవహర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్ భగత్సింగ్నగర్ కాలనీకి చెందిన పుల్లూరి ప్రణీత్(21)గోవర్ధన్(27)లు స్నేహితులు. కాగా గోవర్ధన్ గంజాయి అమ్ముతున్నాడని అతని స్నేహితుడు ప్రణీత్ కాలనీలో దుష్ప్రచారం చేస్తున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. అయినప్పటికి ప్రణీత్ అలాగే ప్రచారం చేస్తున్నాడు. దీంతో ఎలాగైన ప్రణీత్కు బుద్ధిచెప్పాలని ఈ నెల 5వ తేది రాత్రి మాట్లాడాలంటూ గోవర్ధన్తో పాటు అతని స్నేహితులు జశ్వంత్(20), విన్సెంట్(19)లు బయటకు తీసుకెళ్లారు. యాప్రాల్ వాటర్ ట్యాంక్ వెనుకవైపు ఉన్న గ్రౌండ్‌కు తీసుకెళ్లి ప్రణీత్‌ను దారుణంగా కొట్టారు. గోల్ఫ్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రణీత్ తమ్ముడికి ఫోన్ చేసి మీ అన్నకు యాక్సిడెంట్ అయ్యింది. ఆసుపత్రికి తీసుకెళ్లండి అని చెప్పి పారి పోయారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రణీతకు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుం డా తగిన చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ సైదయ్య తెలిపారు.

## సంతోష్‌నగర్‌లో యువకుడి దారుణ హత్య

**సైదాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బండ్ల గూడ నివాసి ఆటో డ్రైవర్ మహ్మద్ అస్లాం సవేరా హోటల్ సమీపంలో తన కుటుంబ సభ్యులతో కలసి నివాసముంటున్నాడు. ఈ నెల 7వ తేదీన మధ్యా హ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అస్లాం ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచా ఫ్‌గా ఉంది. 8వ తేదీ ఉదయం వరకు అస్లాం ఇంటికి తిరిగి రాకపోవడంతో అస్లాం తల్లి రహానా బేగం తమ బంధువులతో కలిసి అస్లాం ఆచూకి తెలసుకో వడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో సంతోష్‌నగర్ డిబి షా గ్రేవ్ యార్డ్ వద్ద చెట్ల పొదల్లో రక్తపు మడుగులో అస్లాం మృత దేహం పడిఉండడంనగమనించారు. ఇదిలా ఉండగా అస్లాంకు అతని స్నేహితు ఫైజల్‌కు మధ్య వైరం ఉన్నట్లుగా ఈ నెల 2వ తేదీన వీరిద్దరు గొడవ పడ్డారని, ఆ సమయంలో అస్లాంను చంపుతానని ఫైజల్ బెదిరించినట్లుగా రహానా బేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అస్లాం సోదరితో తన ప్రేమకు అడ్డు వస్తున్నాడన్న కోపంతోనే ఫైజల్, అస్లాంను హత్య చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# వాడివేడిగా సాగిన కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం

**-బిల్డింగ్ బైలాస్‌పై ఆమోదం తెలిపిన బోర్డు**



కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మెంబర్ బానుక నర్మధ, బ్రిగేడియర్ నంజున్‌దీశ్వర్ సిఈఓ మధుకర్ నాయక్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మడలి సమావేశం వాడి వేడిగా సాగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజున్‌దీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, సిఈఓ మధుకర్ నాయక్‌లు పాల్గొని ఎజెండాలోని అంశాలపై చర్చించి తీర్మాణించారు. బిల్డింగ్ బైలాస్ అనుమతులపై తీర్మాణించారు. తిరుమలగిరిలోని మహాత్మగాంధీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లను నిర్మించాలని ససూచించారు. బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పవర్ బోర్‌వెల్స్‌కు కరెంట్ బిల్లులు బోర్డు చెల్లించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, ఎంపీ ఈటెల రాజేందర్‌లు వాధించారు. అందుకు బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ ఎమ్మెల్యే నిధుల ద్వారా ఏర్పాటు చేసిన పవర్ బోర్ వెల్స్ బిల్లులు చెల్లించే బాధ్యత స్థానికులకే ఉంటుందని సిఈ ఓ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన బకా యిలపై, అక్రమ కట్టడాల విషయంలో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిఈఓ పల్లవి విజయ్ వన్షీ, వివిధ విభాగాల సూరిండెంట్‌లు దేవేందర్, ఆకుల మహేం దర్, రాజుకుమార్, హనీ, ఛీఫ్ ఇంజనీర్ సి.హెచ్.ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పండుగ వాతావరణంలో నిర్వహించుకుందాం

**-మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్**




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

**ముషీరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఈనెల 27వ తేదీ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం తలసాని శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేసించి ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆరోజు అన్ని డివిజన్‌లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించటం జరుగుతుందని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి, 25 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో అదేరోజు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలను నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బాడీ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిధిగా హాజరవుతారని అన్నారు. కేసీఆర్ ఆదర్శవంతమైన పాలనలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా నిలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, పలు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోకాపేట్ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కూల్చివేత

**- ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే జైలుకు పంపిస్తాం : తహసీల్దార్**




కోకాపేట్ సర్వే నెంబర్ 100.లో వెలిసిన అక్రమ నిర్మాణంను జేసిబితో తొలగిస్తున్న రెవెన్యూ అధికారుల దృశ్యం

**నార్సింగి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

గండిపేట మండలంలోని కోకాపేట్ సర్వే నెంబర్ 100.లో వెలిసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. కొందరు కబ్జాదారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, అక్కడే తాత్కాలిక షెడ్లు నిర్మించి, వ్యాపారాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో భారీ పోలీసు బందోబస్తుతో కోకాపేట్‌కు వెళ్లిన రెవెన్యూ అధికారులు జేసీబీతో సదరు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్ట పరిధిలో చర్యలుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం పని చేస్తుందని, అలాగే స్థానిక ప్రజలు సైతం తమ చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే మా దృష్టికి తీసుకు రావాలని, మాకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను భావి తరాల అవసరార్థం కాపాడుకోవడం మన విధి అని పేర్కొన్నారు.

## పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**ముషీరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** పెంచిన వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతూ పేదలు అర్ధాకలితో జీవనం సాగిస్తూ ఉంటే వారిపై ఇంకా వంటగ్యాస్ ధరలు పెంచి, భారం మోపటం సమంజసం కాదని అన్నారు. ఈ నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని, రాష్ట్రం నుండి కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఇద్దరూ కూడా వంట గ్యాస్ ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## స్పీకర్‌ను సన్మానించిన టిఎన్‌జిఓ కేంద్రం సంఘం



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ సన్మానించిన టిఎన్‌జిఓ కేంద్ర సంఘం

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్రం సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ టిఎన్‌జిఓ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో టిఎన్‌జిఓ ప్రతినిధులు కె.ఆర్ రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడు టన్నుల చెత్తాచెదారాన్ని తొలగించాం

**-ఎఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణి**

**గోషామహల్, ఏప్రిల్ 8ప్రభాతవార్త:** యుద్ధప్రతిపాధికపైన తమ పారిశుద్ధ్య కార్మికులతో రహదారులను ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని ఎత్తివేసి రహదారులను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందని గోషామహల్ సర్కిల్ అసిస్టెంట్‌మెడికల్ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శోభయాత్ర సమయంలో స్వచ్ఛంద సంస్థలు, దేవాలయాల నిర్వాహకులు వేదికలు వేసి దారిపోడవునా ప్రసాదాలు, మంచినీటి ప్యాకెట్ల, ఇతరత్రా వ్యర్ధాలను సిబ్బంది యుద్ధప్రతిపాధికపైనతొలగించడం జరిగిందన్నారు. సుమారు 250 మంది జిహెచ్‌ఎంసి షిప్టుల ద్వారా నియమించి జిహెచ్‌ఎంసి సానిటేషన్ విభాగం ఆదనపు కమీషనర్లు రఘుప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డిల పర్యవేక్షణలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో శోభయాత్ర మార్గంలో రహదారులను శుభ్రం చేసి సుమారు 7టన్నులపైగా చెత్త ఇతరత్రాచెత్తచెదారాన్ని తొలగించినట్లు చెప్పారు. శోభయాత్రను తిలకించేందుకుగాను వచ్చిన ప్రజలకు ఉచితంగా 5మొబైల్ లైట్స్‌లను ఏర్పాటు చేయడం చేశామన్నారు. సిబ్బంది కింది స్థాయి అధికారులు కష్టపడి కలిసికట్టు పని చేసినట్లు చెప్పారు.

### ప్రజావసరాలు మేరకు అభివృద్ధి: కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రజావసరాలు మేరకు అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్ నాథ్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో 35లక్షలు వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు ద్వారా కాలనీలో సమస్యలు తీరనున్నాయని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాకేష్ రావు, హనుమంతరావు, యశ్వంత్ రావు, పెంటా రెడ్డి, శేఖర్ రావులుతో పాటుగా కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, వెంకటేష్, సంపత్ యాదవ్ దేవేందర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### క్వాంటం హీలింగ్ ద్వారా మానసిక సమస్యలు దూరం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రతి పదిమందిలో ఒకరు భారత దేశం మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు అని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీచందన చెప్పారు. ప్రవర్తన్ సామాజిక సేవా సంస్థ నిర్వహణ లో జరిగిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భం గా డాక్టర్ చందన సంస్థ కార్యాలయం లో క్వాంటమ్ హీలింగ్ గురించి అవగాహన ప్రసంగం చేశారు మానసిక సమస్యలు వల్ల కుంగుబాటు ఆత్రుత దీనిద్వారా బి పి షుగర్ వంటి వ్యాధులు బారిన అధిక సంఖ్యలో బాధ పడుతున్నారు అని ఆమె వివ రించారు క్వాంటమ్ హీలింగ్ ఆధునిక వైద్య రంగం లో ప్రపంచ వ్యాప్తం గా గుర్తింపు పొందుతోంది అని తెలిపారు మానసిక వొత్తిడి కుంగుబాటు వంటి సమస్యల నుంచి బయట పడటానికి క్వాంటం హీలింగ్ ప్రత్యామ్నాయ చికిత్సా విధానం అని చెప్పారు ప్రవర్తన్ సభ్యులు జె సి ఐ హైదరాబాద్ మైత్రి అధ్యక్షులు హిరన్మాయి సత్యనారాయణ కొణిజేటి తదితరులు పాల్గొన్నారు

### తెలుగు సినిమా నిరంతర సేవలకు సమాంతర ప్రదర్శన

**చిక్కడపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** త్వరలోనే రాష్ట్ర సచివాలయంలో తెలుగు సాంస్కృతిక, తెలుగు సినిమా నిరంతర సేవలకు సమాంతరం పేరుతో రూపొందించిన లఘుచిత్ర ప్రదర్శనను ప్రదర్శింపబోతున్నట్లు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు వివరించారు. ఇందులలో భాగంగా మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. సచివాలయంలో తాను రూపొందించిన అద్భుతమైన ప్రదర్శనను సమర్పించడానికి సంబంధించి ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను కలవడం జరిగిందని, సానుకూలంగా స్పందించారన్నారు. తన 63 సంవత్సరాలలో తెలుగు సాంస్కృతిక, తెలుగు సినిమా నిరంతర సేవలకు సమాంతరం పేరుతో 175 గణనీయమైన సినీ పుస్తకాలు, వేలాది పత్రికల తెలుగు పత్రాలు, పత్రికలను సూచించే 28 సంవత్సరాల ప్రయత్నాలతో పూర్తి చేసినది "పెద్ద బాల శిక్ష" అని అన్నారు. ఇందులో ఎప్పుడూ, ఏ సినిమా ప్రేమికుడు, జానపద, రచయిత కూడా ప్రయత్నించారు తదితర అంశాలు పొందుపరచడం జరిగిందన్నారు.

## జూపార్కులో కప్పల జీవితంపై అవగాహన



జూ పార్కులో కప్పలపై నిర్వహించిన అవేరెనెస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**చార్మినార్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో మంగళవారం కప్పల జీవితంపైఅవేరెనెస్ కార్యక్రమం జరిగాంది. కప్పల జీవిత చరిత్రపై పాతబస్తీలోని ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సేవ్ ది ఫ్రాగ్స్ ఆర్గనేజేషన్ అండ్ ఎకోలాజిస్ట్ డైరెక్టర్ (ఆమెరికా) డాక్టర్ కెర్రీ క్రిగర్ మాట్లాడుతూ అంతరించి పోతున్న కప్పలపై ప్రజలలో అవగాహన పెంపొందించ వలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జూ పార్కు క్యూరేటర్ జె.వసంత, సిసిఎంబి లాకోన్స్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కార్తికేయన్ వాసుదేవన్, జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నీ డాక్టర్ ఎంఏ హకీం, అసిస్టెంట్ క్యూరేటర్ అమృతమ్మ, పిఆర్‌ఓ హెచ్‌ఎం హనీఫ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు చట్టంతో మతస్వేచ్ఛ,రాజ్యాంగ హక్కులపై దాడి

**-తెలంగాణ జమాతే ఇస్లామీ హింద్**



సమావేశంలో మాట్లాడుతున్న మజీద్ షోయబ్, ఉస్మాన్, ఫక్రుద్దీన్, జయాముద్దీన్ అహ్మద్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** లోక్ సభలో వక్ఫ్ సవరణ చట్టం–2025 ఆమోదం పొందడాన్ని తెలంగాణ జమాతే ఇస్లామి హింద్ (జెఐహెచ్)ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయిబ్ తీవ్రంగా ఖండించారు, దీనిని మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వివక్షతతో కూడుకున్నదని ఎందుకంటే ఇది ముస్లింలు తమ మతపరమైన ఆస్తులను సంరక్షించడంలో స్వయంప్రతిపత్తిని హరింపజేస్తుందన్నారు. అదే సమయంలో ఇతర వర్గాల మతపరమైన ట్రస్టులు ప్రభావితం కావన్నారు. ఈ చట్టం 1995 వక్ఫ్ చట్టంలో భారీ మార్పులను తీసుకువస్తుందని ఇది వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ప్రభుత్వ జోక్యాన్ని పెంచుతుంది. మతపరమైన మైనారిటీలకు వారి స్వంత మత సంస్థలను నిర్వహించే హక్కును కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను బలహీనపరుస్తుందన్నారు. పార్లమెంటరీ చర్చ సందర్భంగా అధికారపక్ష సభ్యులు చేసిన తప్పుడు వాదనలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాలు హిందూ, సిక్కు ఎండోమెంట్‌ల కోసం ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నాయని, పర్యవేక్షక అధికారులు సంబంధిత మత వర్గాలకు చెందినవారు మాత్రమే ఉంటారని ఆయన గుర్తు చేశారు. వాస్తవానికి వక్ఫ్ వ్యవహారాల్లో అవినీతి, దుర్వినియోగానికి అనవసరమైన రాజకీయ, అధికార జోక్యం ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. లౌకికవాదాన్ని సమర్థిస్తున్నామని చెప్పుకుంటూనే ఈ రాజ్యాంగ విరుద్ధమైన చట్టానికి మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీల పట్ల నిరాశ వ్యక్తం చేశారు. ఈ కపటత్వం రాజకీయ అవకాశవాదం, మోసానికి పరాకాష్టగా చరిత్రలో నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 29 లను ఉల్లంఘించే ఈ చట్టాన్ని సవాలు చేయాలని ప్రతిపక్ష నాయకులు, లౌకిక శక్తులు, న్యాయ నిపుణులను మేము కోరుతున్నాము. తమిళనాడు ప్రభుత్వం రాజకీయ జోక్యం, మత స్వేచ్ఛను తగ్గించడంపై ఆందోళనలు లేవనెత్తిన విధంగానే తెలంగాణ ప్రభుత్వం కూడా బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈసమావేశంలో కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్, ఫక్రుద్దీన్, మీడియా కార్యదర్శి జయాముద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ సర్కిల్ విద్యుత్ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న టిజిఎస్‌డిసిఎల్ హైదరాబాద్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు చక్రపాణి, డైరెక్టర్లు, సౌత్ సర్కిల్ ఎస్‌ఈ సోమిరెడ్డి

**చార్మినార్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్లు నర్సింహులు, నందకుమార్ ,సాయిబాబా, టిజిఎస్‌పిడిసిఎల్ హైదరాబాద్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు చక్రపాణిలు పాతబస్తీలోని విద్యుత్ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. హైదరాబాద్ పాతనగరం నయాపూల్‌లోని మినర్వా గార్డెన్‌లో సౌతరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఇంట్రాక్షన్ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందిని సూచించారు. సౌత్ సర్కిల్ ఎస్‌ఈ సోమిరెడ్డి మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ అన్ని ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. సౌత్ సర్కిల్ పరిధిలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని, కేబుల్ పనులు పూర్తి చేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింహులు, నంద కుమార్, సాయి బాబా, సౌత్ జోన్ ఎస్‌ఈ సోమిరెడ్డి, చార్మినార్ డిఈ ఎం.శ్రీ ధర్, బేగంబజార్ డిఈ ఫర్హత్ అలీ, అస్మాన్‌ఘడ్ డిఈ విష్ణువర్ధన్ రెడ్డి, మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్, ఫలక్‌నుమా ఏడిఈ రాజు, చార్మినార్ ఏడిఈ మహ్మద్ మక్సూద్, చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్. ఫలక్‌నుమా సిబిడి ఏడిఈ రంజిత్ సింగ్‌తో పాటు సౌత్ సర్కిల్ పరిధిలోని దాదాపు 960 మందివిద్యుత్ అధికారులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ రావలసి ఉండగా కొన్ని కారాణాలు వల్ల రాలేక పోయారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలు నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటలు వరకు జరిగిన సమావేశంలో పాతబస్తీలోని చార్మినార్, బేగంబజార్, ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లకు చెందిన విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు.

### సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం జీవో 21 తీసుకురావడమేమిటి : జేఏసి



ఓ.యూ పరిపాలనా భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

**తార్నాక, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్ల సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 21 వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిసెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జీవో 21కు నిరసనగా మంగళవారం ఓ.యూ పరిపాలనాభవనం ముందు తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిసెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్త చేశారు. రాష్ట్రంలో 12 యూనివర్సిటీలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు నిరసన తెలియజేశారు. డాక్టర్ విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రతతో కూడిన స్కేల్ ఇవ్వాలని లేనిపక్షంలో యూనివర్సిటీ లలో మరో తెలంగాణ ఉద్యమం లా ఉద్యమాలు ఉధృతం చేస్తామని రేపటినుంచి యూనివర్సిటీ లలో తరగతులను భాహిస్కరించి ఉద్యమం చేయాలనీ నిర్ణయించడం జరిగిందిన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్ల సమస్య పరిష్కరించకుండా జి. ఓ 21 ని తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ జీ.ఓ యూజీసీ కి విరుద్ధంగా ఉందని తక్షణమే జి. ఓ 21 ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, రేష్మారెడ్డి, డాక్టర్ మోడెమ్ రవి, డాక్టర్ ఓ. కృష్ణయ్య, డాక్టర్ తాలపల్లి వెంకటేష్, డాక్టర్ మహేందర్, డాక్టర్ అరుణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ అశోక్, డాక్టర్ వాణి, డాక్టర్ హరీష్, డాక్టర్ అర్జున్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని అడిగే హక్కు కవితకు లేదు : జాజుల శ్రీనివాస్‌గౌడ్



చిన్న శ్రీశైలంయాదవ్‌ను సత్కరిస్తున్న బిసి నేతలు

**సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావ్‌పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసే హక్కు ఎమ్మెల్సీ కవిత, బిఆర్ఎస్ ఆధినాయకత్వానికి లేదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పూలే విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని, ప్రస్తుతం అధికారంలో లేనందువల్లనే కొత్త డ్రామకు తెరదించారని ఆయన ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా చిన్న శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్న సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు పూలే విగ్రహానికి కనీసం నివాళులు అర్పించిన పాపాన పోలేదని, బిఆర్ఎస్ అధ్యక్ష పదవి, సిఎం పదవి, కార్యనిర్వాహక అధ్యక్షుడి పదివి బిసిలకు ఇవ్వలేదని, కనీసం ప్రగతి భవన్‌కు పూలే పేరు పెట్టిని వారు, కవిత బిసి నినాదాన్ని ఎత్తుకున్నారని ఆమె మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందని, ఇప్పుడు ఆదే ధర్నా చౌక్‌లో కవిత పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రగతి భవన్‌కు పూలే పేరు పెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 11వ తేదీన ఫిలింనగర్‌లో పూలే 198వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఫిలింనగర్‌లో 7 అడుగుల పూలే విగ్రహాన్ని ఏరా ్పటు చేసి భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, అన్ని పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పూలే జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించలేనందున తామే పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కుందారం గణేషాచారి, విక్రమ్‌గౌడ్, కులకచర్ల శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా హేమ సునీత

**తార్నాక, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా టి. హేమ సునీత, ఐ.ఆర్.ఏ.ఎస్ ఐ.ఆర్.ఏ.ఎస్ (ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్) బాధ్యతలను స్వీకరించారు. 1993 బ్యాచ్‌కు చెందిన టి. హేమ సునీతగారు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ప్రధాన ఆర్థిక సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, కోల్‌కతాలోని ఐ.ఐ.ఎం నుండి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా పూర్తి చేసిన తర్వాత, శ్రీమతి టి. హేమ సునీత 1995లో భారతీయ రైల్వేలలో చేరారు. వడోదరలోని రైల్వే స్టాఫ్ కాలేజీ (ఇప్పుడు నేషనల్ అకాడమీ ఆఫ్ ఇండియన్ రైల్వేస్)లో శిక్షణా కోర్సులో మొదటి స్థానంలో నిలిచినందుకు ఆమెకు "ది డిజి మెడల్" లభించింది. తరువాత ఆమెను దక్షిణ మధ్య రైల్వేకు నియమించబడి జె.ఏ.ఓ, పి.ఎఫ్‌పెన్షన్, డబ్లు. ఎ. ఓ, లాలగూడ, తిరుపతిలో ఎస్. ఎ. ఓ.కన్స్ట్రక్షన్ గా విధులను నిర్వహించారు. దక్షిణ రైల్వేలో రెండు దశాబ్దాలకు పైగా ఆమె పదవీకాలంలో, ఆమె వివిధ హోదాల్లో పనిచేశారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ/ పెరంబూరులో ఆర్థిక సలహాదారు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ప్రాజెక్ట్)గా ఆమె ప్రతిష్ఠాత్మక వందే భారత్ ప్రాజెక్ట్‌లో పాలుపంచుకున్నారు. ఆమె లండన్ మరియు పారిస్‌లోని యూరోపియన్ బిజినెస్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొంది, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్, అక్రూవల్ అకౌంటింగ్, ఇంటర్నేషనల్ టాక్స్ లాస్ మొదలైన వాటిలో నైపుణ్యాన్ని సంపాదించారు.

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా, ఆమె మలేషియా, సింగపూర్‌లోని ఐ.సి.ఎల్.ఐ.ఎఫ్.ఐ.ఎన్.ఎస్.ఈ. ఎ.డిలో శిక్షణ పొందారు. ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ గా బాధ్యతలు స్వీకరించడానికి పూర్వం ఆమె మే 2023 నుండి దక్షిణ మధ్య రైల్వే ఫైనాన్షియల్ అడ్వయిజర్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్/ట్రాఫిక్ కాపెక్స్ మేనేజ్‌మెంట్‌గా విధులను నిర్వహించారు. ఆమె దక్షిణ మధ్య రైల్వేలోని స్కౌట్స్ గైడ్స్ (బుల్బుల్స్) రాష్ట్ర కమిషనర్‌గా ఉన్నారు.

## నేత్రపర్వంగా సాగిన హనుమత్ కార్యసిద్ధి హోమం



గానం చేస్తున్న గాయకుడు చింతలపూడి త్రినాథరావు తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమత్ కార్యసిద్ధి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. పద్మావతి, నిర్మల, ముక్క రామకృష్ణ, వెన్నెల కంటి వెనకాల శిశు కుమార్, మురికి గణేష్, నన్ను కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తిగీతానాలాపన కార్యక్రమం జరిగింది. 'స్వరకిన్నెర' చింతలపూడి త్రినాథరావు రామచంద్రమూర్తిని కీర్తిస్తూ అద్భుతమైన పాటలతో తన గానంతో అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. కాగా 9న సుదర్శనహోమం, 10న శ్రీరామతారక హోమం, 11న చండీహోమం, 12న సింధూర అభిషేకం, అదే రోజు హనుమాన్ జయంతి ఉంటుందన్నారు. మన్యుసూక్త పూర్వ అష్టోత్తర శతకలశ ఘటాభిషేకం, పంచామృత, వివిధ ఫల రస అభిషేకం, ఆకుపూజ, వడమాల పూజలు, మంత్ర పుష్పం ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం సత్యనారాయణస్వామి వ్రతాలుంటాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. 13న, నవగ్రహ రుద్రహోమం, పూర్ణాహుతి, 14న సీతారాముల కళ్యాణ రథోత్సవం, కోలాటం, అన్నసమారాధన ఉంటుందన్నారు. కాగా పునర్నిర్మాణ, దేవతాప్రతిష్ఠ జరిగి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా విశేష పూజలుంటాయన్నారు.

### పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పూలే గుర్తుకురాలేదా

**-ఎమ్మెల్సీ కవితను నిలదీసిన గుజ్జ కృష్ణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో గుర్తుకురాని జ్యోతిరావుపూలే విగ్రహం ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ప్రశ్నించారు. మంగళవారం కాచిగూడలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందుగోపాల్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో గుజ్జ కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మీ తండ్రి కెసిఆర్, మంత్రిగా మీ సొదరుడు కెటిఆర్ ఉన్న సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని నిలదీశారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌కు జ్యోతిరావుపూలే భవన్‌గా పేరుపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో కుల గణనను చేపట్టి బిసిల సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు. బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమెదించారని తెలిపారు. దేశవ్యాప్తంగా బిసి రిజర్వేషన్ల అమలుకు కేంద్రంలోని బిజెపిపై ఒత్తిడి తేవడానికి ఢిల్లీలో వేలాది మందితో బిసిల పోరు గజ్జన దీక్ష కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిందని పేర్కొన్నారు.

### కొత్త రేషన్‌కార్డు కోసం 9899 మంది లబ్దిదారులు దరఖాస్తులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి సర్కిల్ 6 పరిధిలోకి వచ్చే ముషీరాబాద్, అంబర్ పేట నియోజకవర్గాలలో వచ్చే నెల నుండి అర్హులైన లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ దీప్తి వివరించారు. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని ముషీరాబాద్, రామ్‌నగర్, అంబర్‌పేట, హిమాయత్‌నగర్, బాగ్‌అంబర్‌పేట తదితర ప్రాంతాలకు చెందిన 58766 రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఏప్రిల్ 29 వరకు అమలులో ఉండటంతో మే నెల నుంచి పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటివరకు 9899 మంది లబ్దిదారులు కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వెరిఫికేషన్ ఇతర అంశాలను పూర్తి చేసుకున్న అనంతరం కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక



మహిళా దినోత్సవ వేడుకలో మాట్లాడుతున్న డా. అరుణ వెంకట్

**తార్నాక, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ఉమెన్స్ ఎంపవర్ మెంట్ సెల్ ఓ.యూ సైన్స్‌కాలేజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కాన్ఫరెన్స్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా గైనికాలజిస్ట్ డాక్టర్ అరుణ వెంకట్ హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఉద్యోగం, కుటుంబంతో పాటు ఆరోగ్యంపైకూడ శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులు, విద్యార్థులు, అధ్యాపకులు డ్యాన్స్‌లు చేస్తూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ మొట్టమొదటి మహిళ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శైలజ, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. ప్రభాకర్, ఉమెన్స్ కమిటీ చైర్ పర్సన్, డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రణీత, ఉమెన్స్ కమిటీ అధ్యక్షురాలు హైమావతి, సభ్యులు సుహాసిని, వరలక్ష్మి, అపర్ణ, ప్రీతి, సుధా, సునీత, సురేఖ తోపాటు పలువురు పాల్గొన్నారు.

### చార్మినార్ వద్ద వాక్ ఫర్ ఎ హెల్తీ బిగినింగ్ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డిజిపి అన్వర్ ఉల్ హుదా, పలువురు వైద్యులు

**చార్మినార్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నాంపల్లి కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద వాక్ ఫర్ ఎహెల్త్ బిగినింగ్ నడక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డిజిపి అన్వర్ ఉల్ హుదా మాట్లాడుతూనడకవల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, నిత్యం నడవటం వల్ల ఎంతో ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. సిటీ మాజీ డిసిపి కె.బాబూరావు, ఫత్తర్‌గట్టి డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రి, నాంపల్లి కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సమీ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమన్ సల్మాన్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఇర్ఫాన్, సేల్స్ మార్కెటింగ్ హెడ్ కిరణ్ కుమార్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా వైద్యులు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహణతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.

### అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-దళిత చైతన్య సంఘం అధ్యక్షులు నవీన్‌కుమార్ మాదిగ**

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** నగరంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై ప్రభుత్వం, జిహెచ్‌ఎంసి చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం అధ్యక్షులు నవీన్‌కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు శేషాద్రి, మధుసూధన్‌లతో కలిసి మాట్లాడుతూ ...నగరంలోని చాలా ప్రాంతాల్లో జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్, క్రింది స్థాయి సిబ్బంది, చైన్‌మెన్‌లు ఇతర సిబ్బంది ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట వేసి, పూర్తిగా వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. 20 గజాల్లో నాలుగు ఫ్లోర్లు 30 గజాల్లో ఐదు ఫ్లోర్లు ఇలా అవధులు లేకుండా అడ్డగోలు నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారని దీంతో మంచినీరు, మురుగునీరు సమస్యలతోపాటు వ్యర్థాలతో ఆయా ప్రాంతాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హోంగార్డ్ సింహాచలం మృతికి సంతాపం తెలిపిన జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** ట్రాఫిక్ విధులు నిర్వహిసున్న మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డ్ సింహాచలం మృతిపై శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్‌గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి మియాపూర్ మెట్రోస్టేషన్ పిల్లర్ నంబర్ 600 వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసులపై కూకట్‌పల్లి నుంచి మియాపూర్ వైపు ఓ లారీ వేగంగా దూసుకురావడంతో అక్కడే ఉన్న హోంగార్డు సింహాచలం మృతిచెందారు. మరో ఇద్దరు కానిస్టేబుల్స్ వికేందర్, రాజవర్ధన్‌లు గాయపడ్డారు. కాగా మృతిచెందిన హోంగార్డు సింహాచలం కుటుంబానికి జగదీశ్వర్‌గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. అసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ వికేందర్, రాజవర్థన్‌లు త్వరగా కోరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

### మంచినీటి సమస్యను పరిష్కరించాలని వినతి



నీటి సమస్యను పరిష్కరించాలని జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రంను అందజేస్తున్న ఆల్ కాలనీస్ ప్రతినిధుల బృందం.

**నార్సింగి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ ప్రతినిధుల బృందం మంగళవారం జల మండలి ఎండి అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడ్రేషన్ అధ్యక్షులు వంశీ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వేసవి ఆరంభంలోనే మణికొండలో మంచినీటి సమస్య పెరిగిపోయిందన్నారు. ఇళ్లల్లో వేసుకున్న బోర్లు ఎండిపోగా, జల మండలి నుంచి రావాల్సిన నీటిని నెలకు మూడు సార్లు మాత్రమే వదులుతుండడంతో సమస్య మరింత పెరిగిందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరాను పెంచాల్సిన అధికారులు తగ్గించడంతో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారన్నారు. కనీసం రోజు విడిచి రోజైన నీటిని ఎక్కువ ప్రెషర్‌తో సరఫరా చేస్తే ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందని, లేదంటే ఇళ్లను వదిలేసి గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని జల మండలి ఎండితో పాటు సిజిఎం రవీందర్‌రెడ్డికు కూడా వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. సక్రమంగా నీటిని సరఫరా చేస్తే నీటి బిల్లులు చెల్లించేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. జల మండలి నీటిని సరఫరా చేయలేకపోతుండడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. తాము వినతిపత్రం ఇచ్చిన తరువాత అధికారులు స్పందిస్త ఈ సమస్యను వీలైనంత త్వరగానే పరిష్కరిస్తామని హామీనిచ్చారని ఆంజనేయులు వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజలింగం, కార్య నిర్వాహక కార్యదర్శి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### టాక్స్‌ను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి..

**నిజాంపేట్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** కొంపల్లి పట్టణం లోని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులకు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఇంటి పన్నుల విషయంలో ప్రజల సౌకర్యార్థం 5 శాతం రాయితీ ఇవ్వటం జరిగింది. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొనిచో టాక్స్ విషయంలో టాక్స్ పేయర్ (09) నెలల అపరాధ రుసుముతో చెల్లించడం జరుగుతుంది. ఈ క్రింది విధంగా ఒక టాక్స్ పేయర్ చెల్లించు ప్రాపర్టీ టాక్స్ వివరాలు ప్రాపర్టీ టాక్స్ రూ. 1000 వుంటే, ఏప్రిల్ 2025లో కడితేలో రూ.950, జూన్ 2025లో కడితే రూ.1000, మార్చ్ 2026 చివరలో కడితే రూ. 1160పై అపరాధ రుసుమును పరిశీలించగ ఒక టాక్స్ పేయర్ సంవత్సరానికి 23 శాతం అపరాధ రుసుముతో చెల్లించటం జరుగుతుంది. ఈ విషయాన్ని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు గ్రహించి ప్రభుత్వం ఇచ్చిన రాయితీని సద్వినియోగ పర్చుకొని 23 శాతం పెనాల్టీ రాకుండా ప్రాపర్టీ టాక్స్ ను చెల్లించి ప్రభుత్య వెసులుబాటును సద్వినియోగ పర్చుకోగలరు. ఈ విషయాన్ని మీరు మీ గత సంవత్సరం టాక్స్‌తో కంపేర్ చేసుకోగలరు.

## రాజ్యాంగాన్ని మనమే కాపాడుకోవాలి




సదస్సులో ప్రసంగిస్తున్న డా.వినోద్‌కుమార్. చిత్రంలో గడ్డం ఝాన్సీ, వసుంధారదేవి

**సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మనల్ని రక్షించే రాజ్యాంగాన్ని మనమే పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంబాసిడర్, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి డా.వినోద్‌కుమార్ చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మేధావులు, ప్రజా సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వరంలో మంగళవారం అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'రాజ్యాంగ పరిరక్షణ–భవిష్యత్తు ప్రణాళిక' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా నడుచుకుని ఎవరి వాటా వారికి అందజేయాలని, హెచ్చు తగ్గులను పారద్రోలి రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు. ఆంధ్ర మహిళా సభ వైస్–ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వసుంధారదేవి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛా, సమానత్వం సాదించుకోగలిగామని, అంతకు ముందు మను ధర్మం ద్వారా మనుషుల మధ్య అంతరాలు, అసమానతలు పెంచి, కుల, మత వైషమ్యాలను పెంచి ఎన్నితరాలైన ఆ రుగ్మతలు రాజ్యామేలుతున్నాయని చెప్పారు. కుల, మత, వర్గ బేదాలు లేకుండా సమాజం శాంతి, భద్రలతో ఉండాలంటే రాజ్యాంగం అమలు అవ్వడమే ఏకైక మార్గమని ఆమె స్పష్టం చేశారు. ఎంవిఎఫ్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన బాల్యం అందినప్పుడే రాజ్యాంగం అమలు అయినట్లని, విద్యలో అసమానతల వల్లనే సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని చెప్పారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ రజిత, డా.సాధన, జి.శంకర్, న్యాయవాది ప్రకాష్, సత్యవతి, కృష్ణకుమారి తదితరులు ప్రసంగించారు.

